# బంగారు పాదం

సుందరి ఆరోజు ఆఫీసుకు సెలవు పెట్టింది. సెలవుపెట్టి ఇంట్లోనే వుంది. ఇంట్లోనే వుండి సాయంత్రమయ్యేసరికి పెళ్ళిచూపులకు ముస్తాబయ్యింది. పెళ్ళికూతురుగా తన రూపాన్ని నిలువుటద్దంలో కొన్నిసార్లు చూసుకుని తృప్తిపడి - "థాంక్స్ రూపా" అన్నది స్నేహితురాలితో.

"థాంక్స్ చెప్పటంకాదు సుందరీ.... నా పెళ్ళిచూపులకు నువ్వు తప్పక వచ్చి నన్ను డెకరేట్ చెయ్యాలి" అన్నది రూప నవ్వి.

చిన్నగా నవ్వింది సుందరి.

రూప ఆ వీధిలోనే వుంటోన్నది. డిగ్రీ ఫైనలియర్‌లో వుంది. చదువు పూర్తయిన తర్వాత తను పెళ్లి చేసుకుంటానని ఇంట్లో చెప్పింది. ఆమె సుందరికంటే ఐదేళ్ళు చిన్నది.

కేవలం సుందరిని పెళ్ళికూతురిగా అలంకరించటానికి ఆరోజు మధ్యాహ్నం నుంచి కాలేజీకి వెళ్ళకుండా సుందరి దగ్గర వుండిపోయింది.

అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి.

ఇక అంతా పెళ్ళిచూపులకు వచ్చేవాళ్లకోసం ఎదురుచూస్తున్నారు. సాయంత్రం ఐదయ్యేసరికి వస్తామని చెప్పారు వాళ్ళు.

గోడనున్న గడియారాన్ని చూసింది సుందరి. ఐదుగంటలు పది నిముషాలయ్యింది.

"టెన్షన్‌గా వుందా?" అనడిగింది రూప.

"ఉంది.... కానీ అంత ఎక్కువగా లేదు. ఎందుకంటే ఇప్పటికి రెండుసార్లు పెళ్ళిచూపులకు కూర్చున్నాను. అయినా కొంచెం కొత్తగానే వుంది. పెళ్ళికొడుకులు మారుతున్నారుకదా" అన్నది సుందరి చీర నలక్కుండా కుర్చీలో కూర్చుని.

గదిలో సీలింగ్ ఫ్యాన్ తిరుగుతోంది. అయినా సుందరికి ఉక్కపోస్తున్నట్టుగా వుంది. నుదుటిమీద, మెడ కింద తడిగా వుంది.

కర్చీఫ్‌తో తుడుచుకుని "రూపా.... నీక్కూడా చెమటగా వుందా?" అనడిగింది.

రూప నవ్వి "నువ్వు టెన్షన్‌లో వున్నావ్.... నాకు చెమటగా అనిపించటంలేదు. నిజంగా పెళ్ళిచూపుల్లో ఓ థ్రిల్ వుంది కదూ?" అన్నది.

థ్రిల్ వల్లనో యేమో కానీ సుందరి మాట్లాడలేదు. ఆమె మొహంలో భయం కనబడింది.

సరిగ్గా అప్పుడే సుందరి తండ్రి సుందరయ్య వచ్చి "అమ్మాయ్! రెడీయేనా?" అన్నాడు.

తల ఊపింది సుందరి. కూతురు మొహంలో కనబడుతున్న భయాన్ని ఆయన గమనించి విరక్తిగా నవ్వి వెళ్ళిపోయాడు. ఆయన మొహంలో కూడ భయాన్ని చూసింది కూతురు.

వాళ్ళిద్దరే కాకుండా వంటింట్లో వున్న తల్లి కూడా భయపడుతూనేవుంది. అంతా సవ్యంగా జరగాలని దేవుడ్ని కోరుకుంటోన్నది.

యాదృచ్ఛికంగానో.... కాకతాళీయంగానో జరిగే కొన్ని పనులకి సుందరిని కారణంగా అనుకోవటం జరుగుతోంది.

"ఐదున్నరయ్యింది సుందరి" అన్నది రూప.

సుందరి మాట్లాడలేదు. ఆమె ఆలోచనలన్నీ రాని పెళ్ళివాళ్ళమీదే వున్నాయి.

"వస్తారంటావా?" అన్నది సుందరి.

రూప నవ్వి "వాళ్ళు దూరంనుంచి రావాలి. సరిగ్గా చెప్పిన టైమ్‌కు రావటం కుదరకపోవచ్చు. ఇంకో అరగంటలో వస్తారనుకుంటాను. కంగారుపడకు" అన్నది.

మళ్ళీ ఆలోచనలు పరుగుదీశాయి.

సుందరి పుట్టటానికి ముందు ఆమె తల్లిని ఓ హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. సరిగ్గా సుందరి భూమ్మీద పడినప్పుడు ఆ హాస్పిటల్‌లో ఓ రోగి హఠాత్తుగా హార్ట్‌ఎటాక్‌తో పోయాడు. అప్పుడే పుట్టిన సుందరిని డాక్టరు అనుమానంగా చూసింది. అప్పటినుంచీ సుందరి అప్పుడప్పుడు ఇలాంటి అపవాదులకు గురవుతూనేవుంది.

స్కూల్లో చేర్చటానికి సుందరిని తీసుకువెళ్ళిన రోజు పిల్లలకు పాఠాలు చెబుతున్న ఓ మాస్టారు పక్షవాతంతో కూలబడిపోయాడు.

అప్పుడు తండ్రి సుందరిని అదోలా చూశాడు.

కాలేజీలో చేరటానికి వెళ్ళిన రోజు ప్రిన్సిపాల్ వస్తున్న కారుకు యాక్సిడెంటయ్యింది. హాస్పిటల్‌లో పోయాడు. ఇలాంటి సంఘటనలు అప్పుడప్పుడు జరుగుతూనేవున్నాయి. కొన్ని సంఘటనల తర్వాత సుందరి కూడా తనలో ఏదో

శక్తి వుందని అనుకుంది. కానీ తనేం చెయ్యగలదు?

ఉన్నట్టుండి కరెంటు పోయింది.

ఫ్యాను ఆగిపోయింది.

"ఆరయ్యింది ఇక రారేమో" అన్నది సుందరి దిగులుగా.

"ఎందుకంత దిగులు? వస్తారులే" అన్నది రూప.

తనెందుకు దిగులుపడుతోందో రూపకు చెప్పాలనుకుంది సుందరి. కానీ చెప్పలేకపోయింది. చెబితే రూప ఎలా అర్థంచేసుకుంటుందో తెలీదు.

మళ్ళీ కరెంటు వచ్చింది.

ఆరు నెలల క్రితం తమ పెళ్లిచూపులకు తయారైన విషయాన్ని గుర్తుచేసుకుంది సుందరి. వాళ్లు సాయంత్రం నాలుగ్గంటలకు వస్తామని చెప్పారు. చెప్పినట్టుగానే వచ్చారు కూడా. కానీ రిక్షాలోనుంచి దిగిన పెళ్ళికొడుకు ఇద్దరు మనుషుల భుజాలమీద చేతులు వేసి కుంటుతూ లోపలకు వచ్చాడు. బట్టలన్నీ మట్టికొట్టుకుని వున్నాయి.

వాళ్ళు బస్సు దిగి ఆటోలో వస్తుంటే చిన్న యాక్సిడెంటు. ఆటోలో నుంచి కింద పడ్డాడుట. చిన్న దెబ్బ తగిలింది కాలుకి. అయినా తనని చూడాలని వచ్చారు. చాశారు. తిరిగివెళ్ళారు. ఉత్తరం కూడా రాయలేదు.

తర్వాత రెండు నెలలకు మళ్ళీ పెళ్ళిచూపుల కార్యక్రమం జరిగింది. చూశారు. అమ్మాయి నచ్చిందనుకున్నారు. కట్నాల వ్యవహారం తర్వాత మాట్లాడుకోవాలనుకున్నారు. వాళ్ళు తిరిగి వెళ్లిపోయేటప్పుడు పెళ్లికొడుకు తల్లి నడుస్తూనే పడిపోయింది. తల పగిలింది. హాస్పిటల్‌కు తీసుకువెళ్ళారు. వాళ్లూ మళ్ళీ రాలేదు.

ఇప్పుడు మూడో పెళ్ళిచూపులు. వీళ్ళ గతేమవుతుందోనని అందరికీ భయంగా వుంది.

తల్లి వచ్చి "అమ్మాయ్ రూపా.... నువ్వు ఇంటికి వెళ్ళు.... ఎప్పుడో మధ్యాహ్నం వచ్చావు" అన్నది.

సరిగ్గా అప్పుడే రూప తల్లి వచ్చి కూతుర్ని పిలుచుకువెళ్ళింది. మళ్ళీ ఓ అరగంటలో వస్తానని చెప్పి వెళ్ళింది రూప.

"వీళ్ళు అసలు వస్తార్టావా?" అన్నది తల్లి.

"నాకేం తెలుసు? నేనసలే టెన్షన్‌తో చస్తుంటే?" అన్నది సుందరి కోపంగా.

"ఏం జరిగిందో? పోనీ రానివాళ్ళు కబురు చెయ్యొచ్చుగదా" అన్నది మళ్ళీ.

మాట్లాడలేదు సుందరి. అప్పుడే సుందరయ్య వచ్చి "ఇక వీళ్ళు రానట్టే" అన్నాడు.

"ఏమయ్యింది?" అన్నది తల్లి.

"ఒంగోలు నుంచి వస్తున్న బస్సుకు యాక్సిడెంటయ్యిందట. వీళ్ళు ఆ బస్సులోనే వుండివుంటారు" అన్నాడు కుర్చీలో కూలబడుతూ.

ఆ మాటలు విని సుందరికి ఏడుపొచ్చింది.

"బాధపడకు.... అంతా విధిలీల" అన్నాడు సుందరయ్య కూతురితో.

రెండు నిముషాలకు తల్లి, తండ్రి ఆ గదిలో నుంచి బయటకు వెళ్ళారు.

అప్పుడే వాళ్ళ ఇంటిముందు ఆటో ఆగింది. అందులో నుంచి పెళ్లివాళ్లు దిగారు. కిటికీలోనుంచి చూసిన సుందరి కళ్ళు తుడుచుకుని నవ్వింది.

వాళ్ళంతా హాల్లో కూర్చున్నారు.

రూప వచ్చింది.

"సారీ.... చెప్పిన టైముకు రాలేకపోయాం. బస్సు ఆలస్యంగా బయల్దేరింది" అన్నాడు పెళ్లికొడుకు తండ్రి సంజాయిషీ ఇస్తున్నట్లుగా.

"మేం కంగారుపడ్డాం" అన్నాడు సుందరయ్య చిన్నగా నవ్వుతూ.

ఆయన ఎందుకు నవ్వాడో భార్యకీ, కూతురికీ తప్ప ఇంకెవ్వరికీ అర్థంకాలేదు.

వాళ్లముందు కూర్చుంది సుందరి.

పెళ్ళికొడుకు ఓ మాదిరిగా వున్నాడు. కానీ అతనికి ఉద్యోగం లేదు. ప్రయత్నాలు చేస్తున్నాడుట. ఎప్పటికి వస్తుందో తెలీదు.

అతను డిగ్రీ పూర్తి చేశాడు గానీ మార్కులు బాగా తక్కువొచ్చాయి.

సుందరి డిగ్రీ పాసయ్యింది. బాగా పేరున్న ఓ మందుల కంపెనీలో క్లర్కుగా ఉద్యోగం చేస్తున్నది. కానీ సుందరి అంత అందగత్తె కాదు. అలాగని అనాకారి కూడా కాదు. ఆమెలో ఆకర్షణ అసలు లేదు. అందువల్ల సుందరికి అంత తొందరగా పెళ్ళవుతందనే నమ్మకం వాళ్ళెవరికీ లేదు.

పెళ్ళిచూపులయ్యాయి.

సుందరి వాళ్ళకు నచ్చినట్టుగానే అనిపించింది.

పెళ్ళికొడుక్కి తల్లి లేదు. సవతితల్లి వుంది. ఆమె సుందరిని రకరకాల ప్రశ్నలతో ఇబ్బందిపెట్టింది. వాళ్ళు వెళ్ళేముందు ఓ వారం తర్వాత తెలియజేస్తామన్నారు.

సుందరయ్య ఓ ప్రయివేటు కంపెనీలో ఇంకా ఉద్యోగంలోనే వున్నాడు. ఇద్దరాడపిల్లల్లో ఓ అమ్మాయి పెళ్ళి చెశాడు. సుందరి పెళ్ళి ఆయనకో భయంగా మారింది.

వాళ్ళు వెళ్ళాక "మళ్ళీ ఉత్తరం రాస్తారా?" అన్నది తల్లి అనుమానంగా.

"అదంతా విధిలీల" అన్నాడాయన.

వాళ్లీ సంబంధాన్ని ఒప్పుకుంటారన్న నమ్మకం సుందరయ్యకు ఓ మాదిరిగా వుంది. ఎందుకంటే పెళ్లికొడుక్కి ఉద్యోగం లేదు. భార్య సంపాదనతో అయినా జీవితాన్ని వెళ్ళదీయొచ్చు.

వాళ్ళు ఎదురుచూసినట్టుగా వారానికి ఉత్తరం వచ్చింది. కానీ ఆ ఉత్తరాన్ని చదివిన తర్వాత వాళ్ళంతా బాధపడ్డారు. అందులో పెళ్లికొడుకు విధవ మేనత్త చనిపోయిన వార్త వుంది. వాళ్లు పెళ్లిచూపులకు వచ్చిన రోజే ఆమె టపాకట్టిందిట.

ఆ సంబంధానికీ నీళ్ళొదిలారు.

ఇలా జరుగుతుంటే ఈ జన్మకు తనకు పెళ్ళి కాదుగదా అనుకుంది సుందరి. తల్లి కూతుర్ని నిందించింది. కానీ సుందరయ్య కూతుర్ని ఏమీ అనలేదు. అంతా విధిలీలన్నాడు.

కానీ ఊహించనివిధంగా ఇరవైరోజుల తర్వాత వాళ్ళనుంచి ఇంకో ఉత్తరం వచ్చింది. సుందరి నచ్చిందనీ మిగిలిన విషయాలు మాట్లాడుకోవటానికి వస్తున్నామనీ రాశారు.

ఆ ఉత్తరం చదివి సుందరయ్య –

"అంతా విధిలీల" అన్నాడు.

తల్లిమాత్రం "మళ్ళీ ఏమీ జరక్కుండా వుండాలికదా" అన్నది.

"నోర్మూసుకో పక్షీ... ఏమీ జరగదు. సుందరి పెళ్ళి జరుగుతుంది" అన్నాడు సుందరయ్య.

సుందరిలో మళ్ళీ పెళ్ళి ఆశ చిగురించింది.

"కంగ్రాచ్యులేషన్స్ సుందరీ.... ఓ ఇంటిదానివి కాబోతున్నావు" అన్నది రూప.

కావాలిగదా అనుకుంది సుందరి. ఆమెకీ ఇంకా అనుమానంగానే వుంది.

అనుమానం తీరింది. కట్నం బేరం కుదిరింది. నిశ్చయతాంబూలాలు తీసుకున్నారు. మరో వారంరోజుల్లో ముహూర్తాలు పెట్టుకుందామనుకున్నారు. ఎటువంటి అవాంతరాలు లేకుండా పెళ్ళి జరిగితే తిరుపతిలో సుందరికి గుండు చేయిస్తానని దేవుడికి మొక్కుకుంది ఆమె తల్లి ఆ రాత్రి.

వారంరోజులకు మళ్ళీ వాళ్ళనుంచి ఇంకో ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరం చదివి ఇక ఈ పెళ్ళి జరగదనుకున్నారు.

అందులో పెళ్ళికొడుకు సవతితల్లి గుండెపోటుతో ఈ లోకం విడిచి పోయిందని వుంది.

సుందరి ఏడ్చింది. తల్లి కూతుర్ని నష్టజాతకురాలంటూ తిట్టింది. ఆ జన్మకు పెళ్ళి కాదంటూ నిర్ణయించింది. సుందరయ్య మాత్రం మామూలుగానే విధిలీలన్నాడు.

ఈ వ్యవహారమంతా ఆ వీధిలో అందరికీ తెలిసిపోయింది. అంతా సుందరిమీద జాలిపడి పెళ్లవకుండానే ఇద్దరు మనుషుల్ని మింగేసిందని అనుకున్నారు. జీవితాంతం అవివాహితగానే వుండిపోతుందని తీర్మానించుకున్నారు.

వీధిలోకి రాలేకపోయింది సుందరి.

షాక్‌నుంచి తేరుకోలేక ఓ పదిహేను రోజులు ఆఫీసుకు సెలవుపెట్టింది.

ఊహించని విధంగా ఈసారి పెళ్ళికొడుకు వెంకటశివం దగ్గర్నుంచి సుందరి పేరుతో ఓ ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరాన్ని సుందరయ్య కూతురి చేతిలో పెట్టాడు.

ఆశ్చర్యంలో కవరు చించి చదవటం మొదలుపెట్టింది. అందులో ఇలా వుంది.

"డియర్ సుందరీ!

ఇలా జరిగినందుకు మీరంతా బాధపడుతూవుంటారని నాకు తెలుసు. అంతా నిన్ను నిందిస్తూవుంటారు. అయినా నువ్వు పట్టించుకోవద్దు. అంతా మన మంచికే జరిగిందనుకో.... పెళ్ళిచూపులరోజు మా మేనత్త చనిపోయింది. ఆమెకు

ఉబ్బసం రోగం వుంది. మంచంలో వున్న ఆమెకు చాకిరీ చెయ్యలేక మేమంతా చచ్చిపోయాం. ఎప్పుడు చస్తుందా అని ఎదురుచూశాం. వదిలిపోయింది.

ఇక నా సవతితల్లి పరమగయ్యాళి. మీ ఇంటికి వచ్చినప్పుడు ఆమె కొంచెం సౌమ్యురాలిగా నటించింది. ఆమె అంటే అందరికీ భయం. మా వీధిలో అందరితో ఎప్పుడూ ఆమె తగాదాలాడుతూ వుంటుంది. అందుకే అంతా ఆమె ఎప్పుడు వదిలిపోతుందా అని ఎదురుచూశారు.

చివరకు వదిలిపోయింది. ఆమె పోయినందుకు మా నాన్న కూడా అంతగా బాధపడలేదు. అంటే ఆమె అందరినీ ఎంతగా వేధించిందో అర్థంచేసుకో. నీవల్ల మాకు మేలు జరిగింది. మన పెళ్ళయితే ఆమె పెట్టే బాధలను నువ్వు భరించగలవా అని భయపడ్డాను. కానీ ఇప్పుడా భయం లేదు. త్వరలోనే మన పెళ్ళి జరుగుతుంది.

మరో విషయం మా వీధిలో ఆడవాళ్ళంతా నిన్ను పొగుడుతున్నారు. నీకు కృతజ్ఞతలు తెలియజేయాలనుకుంటున్నారు. మీ అడ్రసు అడిగితే ఇచ్చాను. వాళ్ళు మీ ఇంటికి రావొచ్చు. మనం త్వరలోనే కలుసుకుందాం. సంతోషంగా వుండు. ఉంటాను మరి. నీక్కాబోయే భర్త - వెంకటశివం'

ఆనందంతో ఆ ఉత్తరాన్ని సుందరయ్యకిచ్చింది. సరిగ్గా అప్పుడే వాళ్ళ ఇంటిముందు రెండు ఆటోలు ఆగాయి. అందులోనుంచి డజనుమంది ఆడవాళ్ళు దిగి "పెళ్ళికూతురు సుందరి వుండే ఇల్లు ఇదేనా?" అని అడుగుతున్నారు.

వాళ్ళని చూసి సిగ్గుపడింది సుందరి. ❖

*స్వాతి మాసపత్రిక, మే 1999*